# ఫ్లాట్‌లో అమ్మాయి

గొట్టుముక్కల సూరి



మూలం :- స్త్రీని ఓ ఆటవస్తువుగా జమకట్టి లోబరచుకోవాలనే బూజుపట్టిన తరతరాల భావుకతకు ప్రతినిధియైన ఓ మహనీయుని ఆశయం-యీ కథకు ఆధారం.

వ్యాఖ్య :- మానవ జీవిత సాఫల్యం పాలసముద్రం వంటిదైతే, అందు జనించిన హాలాహలంతో ఎదుటివారి జీవిత మాధురుల్ని విషపూరితం చేసే మురికికాల్వలు యింకను ప్రవహిస్తూనే వున్నాయి.

వేసంగి రోజులు. అయితే నేం...

ఝామ్రొద్దెక్కినా ఎండజాడలేదు. ఉక్కగా వుంది. ఒళ్ళు చిటపట లాడుతోంది. జీబురు జీబురుగా నీలినీలి మేఘాలు జుట్టు విరబోసుకొని యిరుల తెరలై వ్రేలుతున్నాయి. వాతావరణం నీరసంగా మూలుగుతోంది.

—నోరు అప్పళించి చూస్తున్నాడు. శ్రీపతి.

ఆ చూపుల్ని చిరునవ్వుతో ఆహ్వానిస్తున్న పూర్ణ, అమ్మ రావడంతో, ఏదో కొంపమునిగే పని వున్నదానిలా యింట్లోకి పరుగుతీసింది.

అడుగంటిన ఆహ్లాదం శ్రీపతి నావరించింది.

"సింహము, చవులపిల్లి ఏయే కోవలకు చెందియున్నవి ?" వరండాలో పాఠాలు చెప్పించుకొంటున్న పార్వతిని అయ్యవారు అగిగారు.

"కోవ...పాలకోవ ...అహాహా''



పూర్ణ–అమ్మ చూపుల్ని ఎలా
ఎదుర్కోవాలోనని బెరుగ్గా శ్రీపతి

యిబ్బంది పడుతూవుంటే, పాలకోవ వాడు దారి చూపాడు;

"ఓ రెం డియ్యి"

—బెత్తం దెబ్బకు పార్వతి వీపు చురుక్కు మంది.

శ్రీపతి మనస్సు చివుక్కుమంది.

పాలకోవమీదనుంచి దృష్టి మళ్ళించింది పార్వతి.

''తిండిమీ దున్న యావ చదువుమీ దెందు కుంటుంది?" పూర్ణ-తల్లి అన్న యీ మాటలలో అనహ్యం రాగాలాపనయి, కోపం సంగతులు వేసింది.

శ్రీపతి గతుక్కు మనడంతో, లయ తప్పి, గుండె గడబిడ కొట్టుకోవడం ఆరంభించింది. చల్లిన యీ అక్షింతలు పార్వతి మస్తకంమీదో, తన మస్తకం మీదో తేల్చుకోలేకపోయినా, అప్రయత్నంగా అతని శిరస్సు మాత్రం అవనత మైపోయింది.

ఆత్రంగా పాలకోవ తింటున్న శ్రీపతికి, "విద్యుద్ఘాతము" తింటున్నానా అనిపించింది. ఒక్కమాటుగా మతిమంతుడై కూర్చున్నాడు; "రొమాన్సు"-పుస్తక దీక్ష పఠనలో మగ్నమై పోయాడు.

"రోగ్ రొమాన్సు తిరగబడింది రోయ్!'' —దారి కడ్డంగా నున్న శ్రీపతిని తప్పుకు పోతున్న అరడజనుమందిలో నుండి వినబడిన మాట లివి.

ఈ అపహాస్యానికి గురి కావడానికి చేత నున్న "రొమాన్సు'' పుస్తకాన్ని తలక్రిందులుగా వుంచి అధ్యయనం చేయడమే పాపం శ్రీపతి నేరం!!

నిజానికి పూర్ణను వీక్షిస్తున్నా, లోకాన్ని పుస్తక పఠనలో మాత్రమే వున్నట్లు నమ్మ మంటాడు. ఒకవేళ ఎవరైనా, "పూర్ణను చూడ్డం లేదా" అని అడిగితే మటుకు, వాళ్ళమీద ఒక్క పెట్టున విరుచుకు పడతాడు; యింగితజ్ఞానాన్ని కోల్పోయి, సత్యానికి, ఆత్మవిశ్వాసానికి సొడ్డు పొడవాలని చూస్తాడు.

వాళ్ళలో తన్నపహసించినవాడి గొంతు శ్రీపతి కంతుపట్టలేదు. ఉబ్బాగా అధ్యయనం చేస్తున్న, ''రొమాన్సు'' పుస్తకంతో పలాయన మంత్రం జపించాడు.

అరడజనుమంది గోలగా నవ్వారు.

"నవ్వుతారు వెధవలు — మా గ్యాంగ్ రానియ్ — వీళ్ళ అంతు తేలుస్తాను'' — ఆ నవ్విన వెధవల్లో రాజు, చలపతి తప్ప తనకి తతిమ్మా వెధవల పేర్లు తెలియవు.

పదిహేనణాల — పూర్ణను చూద్దామన్న కోర్కె వేచుకు తింటోంటే — వుండబట్టలేక — ఒక్కణా — కుర్చీ నీ పట్టుకెళదామన్న మిషతో మళ్ళీ బయటకు వచ్చాడు శ్రీపతి.

మూర్తీభవించిన కోపం (పూర్ణ-అమ్మ) కాంద్రించి ఉమ్మి, తలుపులు భళ్ళున మూసింది.

శ్రీపతి గతుక్కు మని, చుట్టూ పరి

కించి చూశాడు, సిగ్గుతో చచ్చిపోతూ. ఇంకా నయం ఎవ్వరూ చూచినట్టులేదు. ఏవిఁటీ గుండె యింత దడదడా కొట్టుకుంటోంది!

"సింహము క్రూర మృగముల కోవకు, చవులపిల్లి సాధు జంతువుల కోవకు చెందియున్నవి — ఉఁ — చదువ్."

పదహారణాలా — కుర్చీని పట్టుకెళుతున్న శ్రీపతి కీ మాటలు మూసిన తలుపుల్లోనుంచి అస్పష్టంగా వినవొస్తున్నాయి.

ఆరోజు రాత్రి ప్రక్క ప్రక్క గదులలో నున్న శ్రీపతి — గ్యాంగ్ పిల్లుల్ని దుమ్మెత్తిపోస్తే, రాజు, చలపతి — గ్యాంగ్ ఎలుకల్ని దుమ్మెత్తి పోసింది. వాళ్ళవాళ్ళ గదులలో ఎన్నెన్ని పిల్లులు, ఎన్నెన్ని ఎలుకలు రాజ్యమేలుతున్నాయో మరి!

ఆ మర్నాడు ఓ గ్యాంగ్‌లోనివాడు మరో గ్యాంగ్‌లోనివాడి జుట్టు పట్టుకొనే వరకూ వచ్చింది. ఆవేశాలు ఓ గ్యాంగ్ నూరితే, కావేషాలు మరో గ్యాంగ్ నూరింది.

ఇరువైపులవాళ్ళూ పూర్ణను ఓ ఆట వస్తువుగా జమకట్టి, ఎవరిమట్టుకు వాళ్లు దక్కించుకోవాలని ఆవేశించివున్నారు.

## 2

పూర్ణ నవ్వింది.

ఆ నవ్వులో, ఆనందంతో స్పందించే — ఆమె హృదయంనుండి చిందరవందరగా వొలికిన జాతిముత్యాల్ని యేరుకుంటున్నాడు, ఆనంద్.

అది చూచి పూర్ణ చకిత అయ్యింది.

కాని, ఆనంద్ ఆమె నవ్విన తీరును సంతరించుకొని ప్రతి నవ్వాడు. రాగ జలధిలో గలగలలాడే అలలు శబ్దించాయి. వాటిపై రాయంచయై పయనిస్తోంది పూర్ణ.

పూర్ణ చిలిపిగా నవ్వింది.

ఆనంద్ వెకిలిగా నవ్వాడు.

కొంటెగా చూచింది.

పెంకెగా నిలచాడు.

రెప్పపాటు లేకుండా వీక్షిస్తోంది.

తనూ అనిమిషుణ్ణే నని చాటాడు.

ఆహ్వానిస్తూ నవ్వింది.

ఆనంద్ కదలి వెళుతున్నాడు.

అప్రయత్నంగా, "ఆగు" అని సైగ చేసింది.

ఆనంద్ వెనుదిరిగి, తన గదిలోనికి వెళ్ళి తలుపులు భళ్ళున మూశాడు.

అదేరీతిగా, పూర్ణ తన యింటి తలుపులను మూసింది; పూర్ణ పాదరసమై, ఆనంద్ ఎటు కదిలితే అటు జారుతోంది.

ఓ రోజు పూర్ణ కనులలో అగ్ని పర్వతాలు బ్రద్దలవుతున్నాయి. వయస్సు లావా ఆమె అవయవాల్లో యిమడలేక అతలాకుతలం అవుతోంది. అనంతమైన యీ ప్రకృతిలోని యే పదార్థానైనా

భస్మీపటలం చేసివేయగల వేడి ఆమె ఊర్పులో శగలు వారుతోంది. బొంగరాల్లా పొడుచుకొచ్చిన రొమ్ము లామె ఊపిరితోపాటు ఎగిరెగిరి పడుతున్నాయి. ఉడుకు రక్త ప్రవాహ వేగం. గుండె వేగం ఒకదానితో ఒకటి పందెం వేసుకుంటున్నాయి. ఆమెను తలక్రిందులు చేసివేస్తున్నాయి.

వీటిని అవగాహన చేసుకొని నిభాయించుకో గలుగుతున్న ఆనంద్‌లోనికి చొచ్చుకుపోవాలని ఆవేదనపడుతోంది. ఎంత తీయగా, ఎంత గాంభీర్యంగా, ఎంత ధైర్యంగా చూస్తాడు!

తను –

సెలయేరై సెలలువార గలగల నినదిస్తూ, ఆనంద్ హృదయంలో మూల మూలలకు ప్రవహించి పోవా లనీ;

హృదయాన్ని వెలిగించి హారతి నివ్వా లనీ;

ఓ మధురమైన బాధగా అతని హృదయంలో నిలచిపోవా లనీ -

ఉవ్విళ్ళూరుతోంది పూర్ణ.

ఈ సందర్భంలో పూర్ణకో హృదయంగమమైన పాట గుర్తుకు వచ్చింది. ఆమె మనస్సు పరవశాన ఆ పాటను ఓ సారి గానం చేసింది;

తీయగా తీయగా
నా మేను మ్రోయగా
గాటంపు మమతల్లు
మీటితే మీటితే...
కరగి కరగి నేను
పారనా యేరునై
పొర్లనా పొంగార
పోటెత్త నీమేన ॥తీయగా॥
వెలగనా వెలగనా
భావినే దేవినై
కలకాల మీతీరు
కర్పూర హారతై ॥తీయగా॥
మిగలనా మిగలనా
ఆదర్శమూర్తినై
మధురంపు మధురంపు
బాధనై, గాధనై ॥తీయగా॥

"ఎంతటి ఉత్కంఠ!"

"ఎంత బావుంది!! యిప్పటి తన మనోస్థితి కదెంత చక్కగా అమరుతుంది!!!" అనుకొంది పూర్ణ.

అప్రయత్నంగా ఆనంద్ చేతులు ఆమెను ఆహ్వానించాయి.

పూర్ణ మైకంతో కదలింది.

"పూర్ణా" – అమ్మ పిలుపు.


"ఛీ" - విసుగుతో లోపలికి వెళ్లింది.

ఓ రోజు -

కావా లని పూర్ణ తన అవయవాల వొంపుల్ని ఆనంద్‌కు రకరకాల కోణాలలో ప్రదర్శిస్తోంది.

ఆనంద్ రెచ్చిపోయాడు; ఆ మరుక్షణమే తలుపులు భళ్ళున మూశాడు.

పూర్ణ చివుక్కుమంది; యింతవరకు ఇలా తన సౌందర్యరాజసాన్ని గద్దెదింపినవా రెవ్వరూ లేరు. చిన్నబుచ్చినవారు



“నా ఫొటో ఏమిటీ ?... సినిమాటారునా... ఏవన్నా...

లేరు. ఒకరిని కవ్వించి ఆడించగల ననే పూర్ణలోని గర్వోత్సాహాలు చావుదెబ్బ తిన్నాయి.

ఆ మరుసటిరోజు మరీ వేగిపో తోంది ఆనంద్ కోసం పూర్ణ.

ఆరోజు ఆనంద్ పత్తాలేడు.

అలా ప్రతి నిత్యం పూర్ణ కనులు నెల రోజులపాటు వెతికి వేసారాయి. ఆనంద్‌లో ఒక్క అణువు అవుపించినా చాలు ఆమెకి. ఆ స్థితికి దిగజారి పోయిం దిప్పుడు.

ఓ రోజు _

లోకబాంధవుడు దర్శన మీయలేదు. దర్శనభాగ్యం లభించనిదే పూర్ణ-తల్లి పచ్చిమంచినీ ళ్ళయినా ముట్టని రోజది ;

తన భర్త ఏనాడైతే తార్పుడు వ్యాప కాన్ని జీవనోపాధిగా ఎన్నుకున్నాడో, ఆదేరోజునుండి నియమబద్ధంగా ప్రొద్దు చూడనిదే పచ్చిమంచినీ ళ్ళయినా ముట్ట నని దీక్ష పూనింది.

ఈ అలౌకిక ఆధ్యాత్మి కానందంలో తాదాత్మ్యం పొందడం ద్వారా, ఎప్పటి కైనా లోకబాంధవుడు పవిత్ర కర స్పర్శచే తన భర్తను ఆ పాపపంకిల మైన వ్యాపకంనుండి విముక్తి చేసి తీరుతా డని ఆమె నమ్మకం.

సాటి ఆడదాని శీల-ధనం మీద బ్రతకటం ఆమెకు సుతలాము యిష్టం లేదు.

ఇన్నాళ్ళు భర్తనెదిరించి ఏమీ సాధించలేకపోయింది. అందుకే లోక బాంధవుని మీద భారం వేసివూరుకుంది.

పెరటిలో తులసిమంటపం ప్రక్కన నిరామయంగా ఆశీనయై వున్న పూర్ణలో

ఎడతెగని ఆలోచనలు...తన యవ్వన సుమంతో చెలగాట మాడుతున్న నాగరికులను ఆడించి, వినోదాన్ని పొందా లనుకున్నదే కాని, యిలా తనే ఓ వ్యక్తి కోసం దివారాత్రాలు స్పందించిపోతా నని కలనైనా తలవలేదే!

ఎంత విచిత్రం! భవిష్యత్తును అంచనా వెయ్యడం ఎంతటి అవివేకం!!

సూర్యదర్శనంకోసం తహతహలాడిపోతున్న సూర్యముఖి (ప్రొద్దు తిరుగుడు పువ్వు) విరహతోరణంలా వాడి వత్తలై నిర్జీవంగా తులసిమంటపం అంచులమీద వ్రేలింది. తులసి ఆమె తల నిమిరింది, ఓదార్పుగా.

"నా సేవలో ఎక్కడో లోటుచేశాను. అందుకే యీ రోజు నా స్వామి నాకు దర్శన మీయలేదు... దీపాల వేళైంది, యింకా ఎందుకే అక్కడ-రా లోపలికి" పూర్ణ-తల్లి పూర్ణను మేల్కొల్పింది; లోకబాంధవునికోసం వినీలాకాశాన్ని చోదిస్తోం దనుకొని.

రెండు గంటలుగా అక్కడే అచేతనంగా కూర్చున్న పూర్ణలోని ఆలోచనా స్రవంతి చటుక్కున యింకిపోయింది.

"అప్పుడే దీప దీపాల వేళైందా'' అనుకొని, పూర్ణ యింట్లోకి వెళ్ళింది.

## 3

అనాఘ్రాత పుష్పంలా పదునాల్గేండ్ల పూర్ణలో యవ్వనపరువం పుణికి పుచ్చుకుంది. ఆమె పలువరుసలో ఓ పన్ను ఖాళీ. నవ్వినప్పుడా ఖాళీ ఎంతో ముచ్చట గొలిపేది. ఆమె శరీరం పనసతొన పసిమి-నవనీతంలా మృదువు. అగాధమైన నీలి కనులలో అనంతమైన కోర్కెల సందడి, గోముగా కవ్వించి మగవాళ్ళను చంచలింపజేసే సాహసం ఆమెలో అవుపిస్తూ వుంటాయి.

ఆ పేటలో పేర్చినట్లు యిళ్లు మూడు వరుసలు. వెనుక ముందు వరుసలలో ఎక్కువగా విశ్వవిద్యాలయ విద్యార్థులు, ప్రభుత్వోద్యోగులు (బ్రహ్మచారులు) వున్నారు. మధ్యవరుసలోకూడ కుటుంబీకులు చాల తక్కువనే చెప్పవచ్చును. మధ్యవరుస మధ్యలోనే పూర్ణ యిల్లు. ఆనంద్ గది పూర్ణ యింటి కెదురుగావున్న మేడపై భాగంలో వుంది. క్రిందిభాగంలో కూడ అతని మిత్రులే వుంటున్నారు. శ్రీపతి విశ్వవిద్యాలయ విద్యార్థి. తన మిత్రులతో కలసి మూడు గదులు వుంటున్న ఓ యింట వుంటున్నాడు. ఈ యిల్లు ఆనంద్ వుంటున్న మేడ నానుకొనే వుంది.

ఎవరిని చూచినా పూర్ణ చిరకాల పరిచయ మున్నదానిలా గోముగా నవ్వుతుంది. ఆ చూపులు మనిషిని నిలవేస్తాయి. పిచ్చివాణ్ణి చేస్తాయి. కొంత మంది, "మనల్ని ధోకా తినిపిస్తోం దని, ఫూల్సును చేస్తోందని, దానిని నమ్మకూడదని" అనుకుంటూనే - ఆమె అవుపించేటప్పటికి ఒళ్ళు కళ్ళయి చూడడం

వాడు కై పోయింది. అంత ఆకర్షణ ఆమె కనులలో.

ఈ వరవడిలో పూర్ణలోని అందం మిడిసిపడింది; చూచేవాళ్ళ నింకా ఏడి పించా లనే ఉత్సుకత తీగసాగింది.

కొంతమం దామెను పిచ్చి దన్నారు. కాకపోతే ఎవర్ని చూచినా ఆ వెధవ యికిలింపు లేమిటి?

పూర్ణ అందానికి మురుస్తూన్న శ్రీపతిని, "పెళ్ళాడరా నాన్నా" అంటే, "అమ్మో నన్ను బజారులో అమ్మేస్తుంది రోయ్" అనేవాడు. అయితే అతడు ఆమెను ఎందుకోసం ఆకర్షించడానికి తాపత్రయపడుతున్నాడో నని అడిగితే మటుకు తికమక లయ్యేవాడు.

ఓనాడు –

మేడ వరండాలోనున్న వాలుకుర్చీలో సుఖాసీనుడై ముసురుపట్టిన ఆకాశాన్ని తిలకిస్తున్నాడు ఆనంద్. మనస్సు మాత్రం విచిత్రమైన పూర్ణ వ్యక్తిత్వం మీద లగ్నమైవుంది.

పూర్ణలోని బలహీనతను ఉపయోగించుకోవా లని ఎవరిమట్టుకు వాళ్ళు వేచి వున్నారు. ఎంత ఘోరకలి? ఆమె విరిసీ విరియని పువ్వువంటిది; దేహ లాలసే ప్రేమని భ్రమ చెందుతోంది. ఆత్మ వికాసమే ప్రేమకు ఎనలేని ఆభరణ మని తెలుసుకోలేకపోతోంది.

ఈ రకమైన మనస్తత్వానికి కారణ మేమిటి? ఏమో?

– తెలుసుకోవాలి;

ఆమె ఆత్మను మేల్కొల్పి వెల్గుని సాక్షాత్కరింపజెయ్యాలి.

ఆమె బలహీనతను గీటురాయిగా తీసుకొని, ఆమెను పొందా లని, ఒక్కొక్క నాటువెధవకి ఏంతెంత ఆశ! తినేద్దా మన్నట్టు చూస్తారు. అధికారం, డబ్బు, లాలన, వేడికోలుకు ప్రేమ అనే కోటింగ్ వేసి మచ్చిక చేసుకోవా లని చూస్తారు. బాగానేవున్నది. కాని, దాని వల్ల ఆమె జీవితం నాశన మైపోతున్నా, కారణభూతులై యున్న, వీరికి చీమైనా కుట్టదు.

సంఘంలో స్నేహం, సంస్కారం పేర్లతో విశృంఖలంగా తిరిగే మృగ ప్రాయు లున్నారు. వీరు తమ మృగ త్వాన్ని నాగరికత కవచంతో రక్షించు కుంటూ వుంటారు. తమ అవసరాల సాఫల్యం కోసం చుట్టూ కొన్ని సిద్ధాం తాల వ్యూహాన్ని సృష్టించుకుంటారు. ఎదుటివారి బలహీనతపై దెబ్బ కొట్టే వారు యీ కోవకే చెందుతారు. ఈ మూసలో రూపం దిద్దుకుంటున్న మనుషులే తనకు శకున మౌతున్నారు.

* * *

"...కాని ఆనంద్ అందుకు భిన్నంగా అవుపిస్తున్నాడు;" పూర్ణ అనుకుంది.

"అయినా తనకు అతడు అర్థం కాలేదేమో?"

ఎన్నో పక్షు లున్న అరణ్యంలో వేటగానికి ఒక్కటైనా దొరకకపోదు. అదే వేటగాళ్ళెక్కువై, పక్షి ఒక్కటే వున్నప్పుడు? — నేర్పరితనం. కళ ప్రదర్శించినవారికి అది దక్కుతుంది— ఇది రొమాంటిక్ హీరో శ్రీపతి అభిప్రాయం. బాగానేవున్నది. కాని ఆశ్చర్యమేమిటంటే సదరు వేటగాడు తనే నని గట్టిగా నమ్మి చిక్కుల్లో పడుతూ వుంటాడు.

ఒక్కొక్కతరి, ఒక్కొక్క విషయానికి కారణాన్ని అన్వేషిస్తూ కూర్చున్నవారి కది తెలియక — అఖ్ఖర్లేని వారికి చటుక్కున తెలిసి వూరుకుంటుంది.


సరిగ్గా యిలాంటిదే ఒక్కసారిగా శ్రీపతికి తెలిసివూరుకుంది.

పూర్ణ-తండ్రి, కీర్తిశేషురాలైన సమిష్టి—రాష్ట్రపు మద్రాసులోను, ఆంధ్ర రాజధాని కర్నూలులోను వుంటూ వచ్చాడు. ఇప్పుడు ఆంధ్రప్రదేష్ అయిన తరువాత హైదరాబాద్‌కు వచ్చాడు. అంటే రాజధాని ఎక్కడవుంటే అక్కడ ప్రత్యక్ష మౌతున్నా డన్నమాట. అతనికి ఓ టాక్సీకారు వుంది. వచ్చిన కొత్తలో చుట్టుప్రక్కలవాళ్ళు అనేక రకాలుగా చెప్పుకున్న మాట వాస్తవం; విస్త్రీ మడతలు నలగని రాజకీయ నాయకులతో తిరుగుతూ వుంటా డని...యింకా...

ఇవికాక యింకా లోతుకు వెళ్ళి శ్రీపతి తీసిన భోగట్టా ఏమిటంటే — అతడు పెద్దతరహా తార్పుడును వ్యాపకంగా పెట్టుకొని. మూడు పువ్వులు ఆరు కాయలుగా బ్రతుకు వెళ్ళబోస్తున్నా డని. మామిడితాండ్రను యీగలు ముసిరినట్టు పలురకాలవ్యక్తులు రాజధానిని ముసుర్తారని, అందువల్ల బేరసారాలు ఎక్కుతిక్కలుగా వుంటా యని; యీ కారణం వల్లే పూర్ణ-తండ్రి రాజధాని ఎక్కడ వుంటే అక్కడ పాగా వేస్తున్నా డని శ్రీపతి, "డిటెక్ట్" చేశాడు. తన తెలివితేటలకు తానే మురిసిపోయాడు.

బేరసారాల కోసం అడపాతడపా ఒకరో, యిద్దరో పడుపుస్త్రీలు పూర్ణ-తండ్రి యింటికి రావడంకూడా కద్దు. ఇది పూర్ణ-తల్లికి యిష్టమయ్యేదికాదు; కుమార్తెలు పాడవుతా రని, వాళ్ళ జీవితాల్ని మలినభూయిష్టం చేయవద్దని భర్తను వేడుకొనేది. ఉండబట్టలేక, గట్టిగా ఏదైనా అంటే, ఎముకలు విరగ దన్నేవాడు. మత్తుగా త్రాగి వచ్చి, చిత్తుగా బాదిన రోజులే ఆమె జీవితంలో ఎక్కువ. అలా బాదడానికి కారణం ఏమీ వుండేదికాదు.

ఆత్మ వికాసం కలుగని పదునాల్గేండ్ల పూర్ణలోని ఆలోచనలు తండ్రి వ్యాపక వాతావరణంద్వారా వక్రించా యని చెప్పవచ్చు. అయితే అవి క్రియా రూపాన్ని ధరించే ప్రమాదం వరకు రాలేదు. కాని ఆ వాతావరణంలోని దుర్గంధం మాత్రం ఆమెకు సోకింది. ప్రేమ అంటే




"చూడమ్మీ ! మాయింటో పన్జేస్తావా ?"
"ఇంటో ఆడో రున్నారా బాబూ ?"
"లేరు ఊరెళ్లారు."
"అయితే ఆరొచ్చేదాక మఱెవరినైన సూసుకోండి!"

వ్యామోహమేనని ఆమె టీక చెప్పుకుంటోంది. ఈ నమ్మకంపై, గట్టి దెబ్బ తీయాలని ఆనంద్ కలలు కంటూవుంటే, శ్రీపతి లాంటివాళ్ళు ఆమెను వాడుకొని, ఆమె మానానికి ఆమెను వదలివేయవచ్చునని, అవకాశంకోసం ఎదురు చూస్తున్నారు.

ఘర్షణ సంఘర్షణ అయినప్పుడు సమస్య తీవ్రసమస్యగా పరిణితి నొందుతుంది. ఈ పరిణితిలోనే వైవిధ్యం పుట్టి, ఆ సమస్యా పరిష్కృతికి దారి చూపుతుంది. ఇది చరిత్ర చెప్పిన సత్యం. అందుకు భిన్నమైతే అసలీ కథ అడుగు ముందుకు వేయలేదు.

పూర్ణ నర్థం చేసుకోవడానికి, "ఆమె గత జీవితాన్వేషణ" తోడ్పడుతుం దనే దానిలో సందేహంలేదు. అయితే అది ఆమె మంచి నాశించా, చెడు నాశించా అన్నది ప్రశ్న.

## 4

....సరిగ్గా అదే సమయంలో ఎదురుగా అవుపించే దృశ్యాన్ని చూచి శ్రీపతి గుండె ఒకింత సేపు అచేతనావస్థ నొందింది ; ఆనంద్‌కు పూర్ణ పుస్తకం

యిస్తోంది. పార్వతిని తీసుకవెళ్ళి ఏదో పుస్తకం తిరిగి యిచ్చాడు. ఆనంద్. పేరు అవుపించింది. "భగ్న హృదయాలు" — శ్రీపతి గుండెలు భగభగ మండిపోతున్నాయి ; ఆమె ఆనంద్‌కు దక్కిపోతోందేనని ఏడుపు.

"నా కివ్వవూ..." లాలనగా పార్వతి నడిగాడు, శ్రీపతి, ఆమె చేతిలోని పుస్తకం కోసం.

"చూ డక్కా..."

ఆవరకు అక్కడే నిలబడివున్న పూర్ణతో ఫిర్యాదు చేసుకుంది. అక్క యివ్వమనీ, యివ్వొద్దనీ ఏమీ చెప్ప లేదుకాని, శ్రీపతిని చూచి యించక్కా నవ్వింది. శ్రీపతి బ్రతుకు పావన మయ్యింది !

గుండె ఎంత వేగంగా కొట్టుకుంటున్నదో, మెదడు అంత పదునుగానూ ఆలోచిస్తోంది. వీ డెవడు ? ఇంతలోనే యింత చనువెలా యేర్పడింది? ఇంతకూ చిత్ర మేమిటంటే వాడు ఆరాజు, చలపతి గ్యాంగ్‌కు చెందడం !

ఆ మర్నాటికల్లా శ్రీపతి నానా యాతన పడి సేకరించిన సమాచార మిది :

"వాడి పేరు ఆనందట, గుమాస్తాగిరి వెలగబెడుతూ రాత్రి కళాశాలలో ఎల్.ఎల్.బి. మంటబెడుతున్నాట్ట. వాళ్ల గ్యాంగ్ ఆమెను తనకు కాకుండా చేద్దామని, వాణ్ణి పురికొల్పి వొదిలారట ! వాడు ముందు పాపభీతి, నీతినియమం, ఆత్మఘోషని ఏవేవో అఘోరించాట్ట. 'ఆ అమ్మాయి నిన్ను వలచి వరిస్తోంటే, వెధవ ఆ నీతి కబుర్లేవి ?'టని అతని మిత్రు లన్నారట. ఎలాగైనా వాడు సన్మార్గుడట !"

చిత్రం ! పూర్ణకోసం తనలా తాపత్రయపడే ఆనంద్ ఎలాంటి సన్మార్గుడో శ్రీపతి పోల్చుకోలేకపోయాడు.

శ్రీపతి మంటేమిటంటే, "వెధవ, పూర్ణను దక్కించుకోవాలని యింత యిదిగా అవస్థపడుతూనే, పెద్ద నీతి కబుర్లు చెప్పడం."

ఆ రాత్రి శ్రీపతి తన మిత్ర బృందాన్ని సమావేశపరిచాడు. పూర్ణను దక్కించుకోవడం కోసం తాను తప్ప తతిమ్మావాళ్ళెవరూ ఆమెను కన్నెత్తి చూడరాదన్నాడు. ఆనంద్ తప్ప అతని మిత్రులెవ్వరూ ఆమెను చూడడం లేదని, "ఎనాలజీ" పుట్టించాడు. పైగా సహకరిస్తున్నారట ! ఇవన్నీ విని చివరకు వాళ్ళు తేల్చిందేమిటంటే — చూడడంలో తప్పేమీ లేదు కదా — సౌందర్యారాధన, కళా పిపాసకూడ వున్నవని. పూర్ణ శ్రీపతి సొత్తేమీ కాదన్నారు. అయితే ఒక దిలాసా మాత్రం యిచ్చారు ; కావాలని తామెవ్వరూ అతని దారి కడ్డురామని. ఒకవేళ శ్రీపతికి శృంగభంగమై, తన్నులు తినే యోగమే పడితే, చక్రం అడ్డువేస్తా మన్నారు. గ్రుడ్డిలో మెల్ల

అన్నట్టు. శ్రీపతి కొంత మెరుగున పడ్డా ననుకున్నాడు.

ఆ క్షణంనుంచి మంచి మంచి డ్రెస్సులు, క్రీములు, సెంట్లు, షోకులతో ఆమెను దక్కించుకోవాలని ఆయత్త మౌతున్నాడు. ఆడవాళ్ళను షోకులతో దక్కించుకోవచ్చునని అమధ్య నెక్కడో చదివినట్టు గుర్తు శ్రీపతికి.

## 5

ఈమధ్య పూర్ణను చూడడం కంటె, కేవలం పూర్ణను చూస్తున్న వారిమీద నిఘాయే, తన వ్యాపకంగా పెట్టుకున్నాడు శ్రీపతి. ఒక్కొక్కసారి అవధులుదాటిన కోపం ముంచుకవచ్చేది. అయితే అది పూర్ణచే అకర్షితు లవ్వా లనుకున్నవారి మీదో, పూర్ణమీదో, తనమీద తనకేనో ?— అయోమయ స్థితిలో పడ్డాడు శ్రీపతి.

పూర్ణ—తండ్రితో పరిచయం కొనుక్కున్నాడు శ్రీపతి :

ఉన్నట్టుండి పనీపాటా లేకుండా ఓరోజు టాక్సీ మాట్లాడుకొని హైదరాబాదు నగర ప్రదక్షిణం గావించాడు. ఇందుకు అమాంబాపతు ఆరుపదులు మాత్రమే అయ్యాయి. ఇందువల్ల అతను సాధించిన దేమిటంటే, పూర్ణ-తండ్రితో వాళ్ళ యింటికి వెళ్ళేంత చనువు సంపాదించడం. ఈ ఘనకార్యానికి శ్రీపతి తన్నుతాను పదేపదే అభినందించుకున్నాడు. విదేశీయులు భారత భూభాగా న్నుండి వైదొలగినప్పుడు యావన్మంది భారతీయులలో విరసిన సంతోష సంరంభం యిప్పుడు శ్రీపతిలో మెరసింది. తన్నుతానే గర్వంగా చూచుకొనేవాడు. తానందరికంటె ఎంత అదృష్టవంతుడు ! తను సాధించిన యీ ఘనవిజయానికి తన మిత్రులు నోరు అప్పళించి, కళ్ళు తేలవేస్తున్నారు. పూర్ణ యింటికి వెళుతోంటే, వైతాళికుల జయజయ ధ్వానాల్లా, "శెహబాష్" అంటూ తన్నెంత గొప్పగా చెప్పుకుంటున్నారు ! ! దేవతల పుష్పవర్షంలా తనమీద ఎంత చక్కని దృక్కులను బరపుచున్నారు !!! చివరకు ఆ ఆనంద్‌గాడుకూడ......వాడి పొగరణిగింది.

శ్రీపతి మిత్రులతోసహా చాలమందికి అతడే అందల మెలా ఎక్కాడా అని ఆశ్చర్యంగానే వున్నది. కాని, దాని వెనుక తగినంత కారణం లేకుండానే, అవిరామంగా టాక్సీమీద తిరగడాలు, పూర్ణను, పూర్ణ—తండ్రిని, పార్వతిని సినిమాలకని, పిక్‌నిక్‌లకని తీసుకవెళ్ళడాలు, పార్వతికి మిఠాయిలు తినిపించడాలు, చివరకు పార్వతి కనే మిషతో పువ్వులు పట్టుకరావడం వరకూ వచ్చిందని వీళ్ళ కేం తెలుసు ?

ఓ రోజు—

"ఇవిగో బాదుషాలూ, పువ్వులూ" అన్నాడు పూర్ణ కిస్తూ శ్రీపతి. పూర్ణ—తండ్రి లోపల భోజనం చేస్తున్నాడు. పార్వతి ఎక్కడికో పేత్తనాలకు వెళ్ళిన

ట్టుంది. అంటే పూర్ణ, తను తప్ప ఆ గదిలో మరెవ్వరూ లేరన్నమాట.

శ్రీపతి పావన మయ్యేలా నవ్వుతూ, "ఎవరికి?" అంది పూర్ణ.

శ్రీపతి తల క్రిందుకి, కాళ్ళు పైకి అయినట్టు ఫీలయ్యాడు. ఏదో మాట నోటి నుండి పెగలి రాలేక గిజగిజ లాడుతోంది. చివరకు గుండె వేగాన్ని అదుపులో పెట్టుకోవడానికి విఫలయత్నం చేస్తూ, ముచ్చెమటలు పోయగా, "పా..ర్వతికి" అని ఉచ్చరించగలిగాడు.

"బ్రేవ్" మని త్రేన్చుతూ పూర్ణ — తండ్రి రావడంవల్ల — శ్రీపతి ఆ సంకటావస్థనుండి బయటపడగలిగాడు. వెంటనే అతనితో కలసి టాక్సీమీద ఎక్కడికై తేనేం, వెళ్ళిపోయాడు.

టాక్సీలో వెళుతున్నంత సేపూ తన పిరికితనానికి తన్నుతాను నిందించుకున్నాడు, శ్రీపతి. అసలా పువ్వులు పూర్ణకని పట్టుకవెళ్ళాడు. తీరా యింటికి వెళ్ళేప్పటికి ఎలా యివ్వాలో తెలియక జావయిపోయాడు; యిస్తే యేమనుకుంటుందో నని భయం. అంతటి చనువు యేర్పడే స్థాయికి చేరుకోవాలంటే మాటలా? ఇంకా ఎన్నెన్ని మారులు టాక్సీలమీద సినిమాల కని, పిక్‌నిక్‌ల కని తిరగాలో, ఎన్నెన్ని మారులు పువ్వులు తీసుకరావాలో? అయితే అవుగాక, ఆ మధురక్షణం కోసం కాకపోతే తానిలా ఓర్మి వహించేవాడేనా? అది మాత్రం ఎంత దూరంలో వుందికనుక!

ఈమధ్య యిన్నిన్ని మనియార్డర్లు, యిన్నిన్ని టెలిగ్రామ్ మనియార్డర్లు ఎందుకు వస్తున్నాయో, శ్రీపతి మిత్రులకు వెంటనే తెలిసిందికాదు.


ఆషాఢ మేఘాలు దయ్యాల్లా ఆవరించిన ఓరోజు సాయంసంధ్యలో శ్రీపతి ఓ పగటి కల కన్నాడు; పూర్ణ తనను చుంబించినట్టు. అంతవరకు కలలు కల్లలనే శ్రీపతికి, యీ కల వచ్చినప్పటి నుంచి కలలు వల్లమాలిన నిజాలుగా గోచరించసాగాయి.

ఆ మర్నాడు సాయంసంధ్యలో సరిగ్గా అంతకు ముందురోజు కల గన్న సమయానికే ఆనంద్ పూర్ణ యింటిలోనికి, పెరటి గుమ్మంద్వారా ప్రవేశించడం శ్రీపతి కళ్లారా చూశాడు. కాబట్టి నమ్మక తప్పిందికాదు. ఎంత కోపం రావాలో అంతా రాకనూ తప్పిందికాదు.

"వాడిఅంతేవిటో యివాళ తేలుస్తా" ననుకున్నాడు.

శ్రీపతి పుణ్యాన అంతపని అయ్యింది కూడా! ఎక్కడెక్కడ వెతికాడో కాని, చివరకు పూర్ణ-తండ్రిని యింటికి తీసుకవచ్చాడు. చిత్ర మేమిటంటే అంతవరకు ఆనంద్ పూర్ణ గదిలోనే వుండడం!

"సాటి స్త్రీల శీలాన్ని వెల బెడుతున్న నీకు...కూతురై తేనేంగాక...డబ్బు...డబ్బు...యిప్పుడు నీ కూతురు పక్కా-వేశ్య..." పూర్ణ-తండ్రి చిత్తుగా




"చూడండీ! మీచిత్రాన్ని ఎలాటి దుస్తులతో చిత్రించమంటారు?"
"మీరు నాచిత్తరువుకోసం అనవసరంగా శ్రమపడకండి; మీరుమామూలుగ ధరించే దుస్తులతోనే చిత్రించండి."

---

త్రాగివున్న మైకంలో సైతం మానవత్వాన్ని సంతరించుకున్న అదృశ్యవాణి పలుకులు మహోన్నతమైన ఆత్మవికాశపు ఎత్తులనుండి వినబడినట్టు గ్రహించగలిగాడు.

"కడుపుకోసం పడుపు వృత్తి. వేశ్యలకు నే చేస్తున్నది మేలేకాని కీడుకాదు. గర్వంగా చెప్పగలను" — పూర్ణ—తండ్రి గుండె లెగబెట్టి గర్జించాడు.

"నోర్ ముయ్" అదృశ్యవాణి గద్దింపుకు అదిరిపడ్డాడు. —"కడుపుకోసం పడుపు వృత్తి నవలంబించేవాళ్ళు కాదు వేశ్యలు, వ్యభిచారం కోసం వ్యభిచరించే నీ కూతురులాంటివాళ్ళు..."

"కాదు...వీల్లేదు...వీల్లేదు...వాడి రక్తం కళ్ళజూస్తాను" పూర్ణ—తండ్రి గర్జింపు.

...లోపల పూర్ణానందులు ఎందుకో విరగబడి నవ్వుకుంటున్నారు.

పూర్ణ—తండ్రికి కంపరమెత్తిపోయింది. టాక్సీలోనున్న యినుప

కడ్డీతో మెరుపుతీవలా యింట జొర బడ్డాడు.

ఈ నాటకాన్ని ఓ స్థాయికి తీసుక వచ్చిన శ్రీపతి నేపథ్యంలోనే వుండిపో యాడు. తన గదిలోనే వుండి, ఆనంద్ దేహశుద్ధి తాలూకు సంగీతం విందామని చెవులు రిక్కించి కూర్చున్నాడు. శ్రీపతి లోని యీర్ష్య పొట్ట విచ్చుకునేలా నవ్వుకుంది.

ఆవేళ సాయంత్రం గాని, మర్నాడు గాని ఆనంద్ అవుపించలేదు. పలువురు పలురకాలుగా చెప్పుకున్నారు. అదైనా శ్రీపతి ప్రచారంవల్లే; మెత్తగా తంతే వైద్యాలయంలో రంగునీళ్ళు సేవిస్తున్నాడనీ, ఏ హుస్సేన్ సాగర్‌లోనో పూర్ణ తండ్రిచేత పాతబడ్డాడనీ, అవమానం భరించలేక ఆత్మహత్యకు పాల్పడ్డాడనీ, అహఁ ఎక్కడికో పలాయన మంత్రం జపించాడనీ వీటిలో ఏదోఒకటి నిజమే. ఎందుకంటే, ఆనంద్ శెలవైనా పెట్ట కుండా ఆఫీసుకు ఎగనామం పెట్టాడనీ భోగట్టా తీశాడు శ్రీపతి. అందుచేత పూర్ణ మానదాత, ప్రాణదాత తానేనని అడిగినవాళ్ళకు యేకరువు పెట్టడం ఆరంభించాడు.

ఇంతటి సంకటావస్థనుండి పూర్ణ-తండ్రి కుటుంబాన్ని దాటవేసి, ఖ్యాతి గడించుకున్న శ్రీపతి, పూర్ణ కుటుంబం లోని వ్యక్తిగా పరిగణింపబడే శ్రీపతి - ఆ ఘటన జరిగిన మర్నాడే, సదరు కుటుం బీకులంతా ఎక్కడకు వెళ్ళారని అడిగితే, చెప్పలేక నోరు వెళ్ళబెట్టాడు. తనతో మాటమాత్రమైన చెప్పకుండా యిలా ఎందుకు వెళ్ళారో నని శ్రీపతి గిజగిజ లాడాడు. ఏదో కొంపమునిగేపని వుండి వాళ్ళూరు వెళ్ళారని అడిగినవారిని నమ్మింపజూచినా, తన్ను తాను నమ్మించుకోలేకపోయాడు.

అలనాడు క్షీరసాగర మథనానంతరము అమృతము బంచ మోహినీ రూపంలో వచ్చిన శ్రీమహావిష్ణువునుండి దైత్యులకిది లభించకపోతే కలిగిన ఆశా భంగము, క్షోభ, ఉక్రోషము యిప్పుడు శ్రీపతికి దాపురించాయి.

వాళ్ళ కుటుంబంలో ఒకడుగా జీర్ణించుకుపోయిన తాను, పూర్ణను ఏమడిగితేమాత్రం కాదంటుంది? పూర్ణ వెళ్ళిపోతుందని తనకి ఒక్క రెండు రోజులుముందు తెలిస్తే అడగనా అని విచారం పట్టుకుంది శ్రీపతికి. ఇన్నాళ్ళుగా అటువంటి దినద్వయాలెన్ని గతించలేదు. ఇక రెండురోజు లుంటే మాత్రం అడగగలనా అనే ఆత్మవిమర్శ నాత్మకమైన మీమాంస శ్రీపతి ఏమీ చేసుకోలేదు. కాని, అడగలేకపోననీ, ఆమె కాదనకపోదనీ అతని కోవిధమైన నమ్మకం. అందుకే మళ్ళీ పూర్ణ ఎప్పుడు తిరిగివస్తుందా అని ఒళ్ళు కళ్ళయి ఎదురు చూస్తున్నాడు శ్రీపతి.

## 6

కొన్నాళ్ళ తరువాత—

పూర్ణ—తండ్రిగాని, అతని కుటుంబంగాని ఎన్నాళ్ళకూ యీ చాయలకు వచ్చినజాడ లేదు. ఆనంద్ యేమైనదీ కూడ అంతుపట్టలేదు. శ్రీపతిలోని పూర్ణరూపం రోజు రోజుకు మసకేసిపోతోంది. గుర్తుకువచ్చినప్పుడల్లా తాను ఖర్చుచేసిన డబ్బుగురించి విచారించేవాడు.

టెలిగ్రామ్ మనియార్డర్ వచ్చిన రోజురాత్రి పదిగంటలకు కృష్ణాలో, 'దిల్ తేరా దివానా' చూచి వస్తున్నాడు. పరుసు బరువుగావుంది. మదీనాలో కోడి పలావ్ సుష్టుగాభోంచేసి బస్‌స్టాప్‌దగ్గరకు వస్తూవుండగా శ్రీపతిగుండె ఒక్కసారి నోట్లోకివచ్చినంత పనైంది. చంద్రమండలంలో మొట్టమొదటిసారి జెండా పాతిం దెవరయ్యా అంటే – 'ఏ కృష్ణారావో, రామారావో' అని ఠక్కునచెప్పే స్థితిలో వున్నాడు. మనం రెట్టించి రష్యావాడుకాదా అంటే, "కావచ్చు – గగారిన్ అయితేనేమి, కృష్ణారావైతేనేమి?" అని సర్వమానవ సౌభ్రాతృత్వాన్ని వల్లెవేస్తాడు.

శ్రీపతి యీ స్థితిలో వుండడానికి కారణం – పూర్ణ అవుపించడం. ఇదివరకటికంటె నిగ్గుదేరిన సౌందర్యాన్ని పుణికిపుచ్చుకుంది. పాము కుబుసము వంటి ధవళవస్త్రధారిణి యైన పూర్ణను నఖశిఖపర్యంతం ఎంత సేపు చూస్తే మాత్రం తనివితీరుతుంది! గంధర్వకాంత దారితప్పి రాలేదుకదా!!

ఆమె విషయాలు యిదివరకే తెలిసి జాలినొందాడు. పాపం ఆమెతండ్రి చనిపోయాడట. ఆ టాక్సీనికాస్తా అమ్మి అతనిని ఖననపరచగా మిగిలినది అప్పు తీర్చారట. వాళ్ళ కో తాతలనాటి డాబా వున్నదట. దాని మీద అద్దెగా వచ్చే కొద్దిపాటి ఆదాయంతోను అతని భార్య. పార్వతితోసహా ఎలాగో బ్రతుకు వెళ్ళదీస్తోందిట. చివరకు యీ చార్‌మినార్ వద్ద 'మెహందీ'లో పడుపువృత్తి నవలంబిస్తోందన్నమాట. పూర్ణ! అసలే పూర్ణచాంచల్యం పరమప్రవరాఖ్యులనైన యిట్టే ఆకర్షించగల నేర్పును సంతరించుకొన్నది. ఇప్పటి యీ పరిణామాన్ని తా నిదివరకే గణించాడు. ఒకరి భవితవ్యాన్ని యింతచక్కగా అంచనా వెయ్యగల తన సామర్ధ్యానికి శ్రీపతి ఉబ్బి తబ్బిబ్బయిపోయాడు. అయినా పాపం, ఏదోలా జీవించాలిగామరి! ఆది నుండి ఆమెతండ్రి బ్రతుకు యీ వృత్తి ఆలంబనగానే వెళ్ళమారిపోయింది. ఇప్పుడు అదేవృత్తిని పూర్ణ జీవనోపాధిగా మలచుకోవడంలో. ఆశ్చర్యమేముంది!!

ఆమెకు సహాయం చెయ్యాలని, పాపం, శ్రీపతి తహతహలాడిపోయాడు.

గుండెను దిటవుపరచుకొని పూర్ణకు అవుపించేలా రెండు, మూడుసార్లు తచ్చాడాడు. కాని, అదేవింటి ముక్కూ, మొగమూ, ఎరుగనట్టు ఆలా తప్పించుకు పోతుంది! తన్ను చూచి బావురు మని యేడుస్తుంది, ఓదార్చుదా మని తల పోశాడు శ్రీపతి. కాని అలాంటి దేమీ జరగలేదు. చివరకు తనే పలకరించాడు. ఆమె పెదవులు నవ్వితే ఎఱ్ఱదానిమ్మ విచ్చుకుంటోందా అనిపించింది. తన బ్రతుకు పావనమయ్యే నవ్వు మళ్ళీ ఎన్నాళ్ళ కెన్నాళ్ళకు! పౌడరు ధావళ్యం చార్‌మినార్ కలంకరించబడిన సిరిధూరపు రంగు లైట్లకాంతిలో మిళితమైపోయింది. లిప్‌స్టిక్ పెదవుల తొగరు, సింధూరం కలసి ముదురుజేగురు రంగై భాసించింది.

ఎంత చవులూరిస్తున్నాయి పెదవులు! పెదవులను తడిచేసుకున్నాడు–చినుకులు పడి కాబోలు, శ్రీపతి. అప్పటికే సన్నని జల్లు ఆరంభమైందిగా మరి...!

ఆమెతండ్రి చనిపోయినందుకు గాఢ సంతాపాన్ని వెలిబుచ్చాడు. శ్రీపతి. అంత మంచివాడు లేడని, సరాసరి స్వర్గానికే వెళతా డని అన్నాడు. తల్లి, చెల్లెలి క్షేమాలు అరశాడు.

పూర్ణ మౌనంగా నవ్వింది.

వెనుకబడి ఆమెయింటికి వెళ్ళాడు శ్రీపతి. అందుకు పూర్ణ అవరోధ మేమీ చెప్పలేదు. ఇంటికి వెళ్ళగానే ఆప్యాయంగాను, ఉల్లాసంతోను, "రండి శ్రీపతి గారూ" అని ఆహ్వానించింది. బిస్కట్లు, కాఫీ యిచ్చింది. పళ్ళెరంలో వున్న మూడు తాంబూళపు పట్టీలలోనుండి ఒకటి తీసియిచ్చింది.


పూర్ణకు తనమీద యింతటి, "యిది" వుందని శ్రీపతి యిదివరనుంచీ అనుకుంటున్నదే. అందుకనే అతని కేమీ ఆశ్చర్యం కలుగలేదు సరికదా, క్రొత్త అసలే చెయ్యలేదు!

శ్రీపతి యిక ఓపలేక, ఓ వంద రూపాయల కాగితాన్ని పర్సులోనుండి తీసి ఆమె కిచ్చాడు. ముసిముసి నవ్వు లొలకబోస్తూ ఆమె దానిని స్వీకరించింది.

"ఎంత మురిసిపోతోంది" అనుకున్నాడు శ్రీపతి.

సరిగ్గా అదేసమయంలో మేడమీద నుండి రెండు మగ గొంతులు పగలబడి నవ్వుతున్నాయి. శ్రీపతి ఒకింత సేపు జడుడైపోయినమాట నిజం. కాని పూర్ణ ముసిముసి ఖుషీ అతనిని మామూలు స్థితికి తెచ్చింది. మళ్ళీ మరో వంద యిచ్చి, "..మరెవ్వరూ వుండకూడదు" అన్నాడు. ఇంతవరకు ఉగ్గబట్టిన నవ్వు ఉధృతాన్ని యిక తట్టుకోలేకపోయింది, పూర్ణ. ఉప్పెనలా, పెద్దపెట్టున నవ్వుతూనే స్వీకరించింది.

ఈ నవ్వుకు శ్రీపతి బెంబేలుపడిపోయాడు. కాని సమ్మతి కానప్పుడు డబ్బెలా స్వీకరిస్తుంది? అందుకని




"నా పెళ్ళయిన ఇరవయి సంవత్సరాలకుగాను, ఈ మధ్యే కొంచెం సుఖం అనుభవిస్తున్నా - మా ఆవిడ పుట్టింటికెళ్ళి నెల్లాళ్ళయింది."

ఆమెతో బాటు, ఆమెకంటె యిల్లెగిరిపోయేలా వెకిలిగా నవ్వడం ఆరంభించాడు. ఎందుకు నవ్వుతున్నా డంటారేమో ? — ఆమె నవ్వుతోంది...నవ్వుతున్నాడు. అంతే. అంతా గందరగోళంగా వుంది శ్రీపతికి.

శ్రీపతి నవ్వు ఆరంభించే సమయానికి, సరిగ్గా పై రెండు గొంతులు చటుక్కున ఆగిపోయాయి. ఇది పూర్ణగాని, శ్రీపతిగాని గమనించలేదు. ఇంకా విరగబడి నవ్వుతూనే వున్నారు. ఇంతవరకు యింత సుదీర్ఘమైన నవ్వు శ్రీపతి నవ్వి వుండలేదు. అలనాడు సీతా స్వయంవరంలో రాములవారు ధనువును విరచినప్పుడు పొందిన ఆనందంకంటె రెట్టింపు ఆనందం యిప్పుడు శ్రీపతి పొందాడు. పూర్ణ తనకి దక్కినందుకు. ఇక్కడ ఆనందం అనడంకంటె ఉన్మాదం అనడం సమంజసం. ఈ ఉన్మాదంలో పైవాళ్ళు క్రిందికి దిగడం శ్రీపతి గమనించలేదు.

"వీరి దేదో కేసుందట, యిదో అడ్వాన్సు!" వచ్చిన యిద్దర్లోను ఒకరి నుద్దేశించి అంది పూర్ణ.

మౌనంగా అతడా నోట్లను అందుకున్నాడు.

ఆవరకు ఆవేశించిన పిశాచంలా నవ్వుతూన్న శ్రీపతికి పూర్ణ మాటలు విన్న తరువాత మైకం ఒక్కసారిగా దిగిపోయింది.

"కే సేవిఁటి! కే సేవిఁటి!!" అని శ్రీపతి అస్పష్టంగా తనలో తను గొణుగుకుంటూవుండగా, పూర్ణ, "నా క్లాస్ మేట్ — పేరు శ్రీపతి" — అడ్వకేట్‌కు పరిచయం చేసింది.

"కేసు వివరాలు చెప్పండి" అడ్వకేట్ అన్నాడు శ్రీపతి నుద్దేశించి.

"రేపు ఉదయం వస్తారులెండి" — అని వెంటనే పూర్ణ అందుకుంది.

"రామ! రామ!! తాన న్నా డా మాట!!!" శ్రీపతికి నోటినుండి మాట రాకపోయినందుకు, పూర్ణ చెప్పడం చాల మెరుగైంది. కాని అడ్వకేట్‌ను చూచిన క్షణంనుంచి అప్పళించిన నోరు అలానే వుండిపోయింది. తేరుకొని, పూర్ణ అన్న మాటకు అంగీకారంగా తల పంకించి, కాళ్ళు తేలిపోతూవుండగా – కళ్ళు బైర్లు క్రమ్మిన ట్లుంటే శ్రీపతి వెళ్ళ డానికి లేచాడు. అక్కడున్నవారి కెలాగో నమస్కరించి, ఆ సంకటావస్థనుండి బయటపడ్డాడు. నాలుగు గజాలు నడిచాడో లేదో పూర్ణ యింటిలోనుండి బిగ్గరగా నవ్వులు వినబడుతున్నాయి. ఆ నవ్వుల్లో ఎంతటి అవహేళన! శ్రీపతి షాక్ తిన్నట్టు వెనుదిరిగి చూశాడు.

"పూర్ణానంద్, ఎల్. ఎల్. బి.,
హైకోర్టు అడ్వకేట్" –

పేరుబల్ల కొట్టవచ్చినట్టు అవుపించింది. కుండులోనుండి ఎగబ్రాకిన రాధామనోహర్ తీవలు విరబూచి, ఆ బల్ల చుట్టూ అందంగా అల్లుకొని ఎంతో శోభను చేకూర్చాయి. తెరచివున్న గుమ్మంలో నుండి లోపల కోటుస్టాండ్‌కు తగిలించి వున్న నల్ల-కోటు కొరివిదెయ్యంలా అవుపిస్తోంది. ఆ దెయ్యం రెండు చేతుల లోను రెండు వందరూపాయల నోట్లు లీలగా అవుపడుతున్నాయి.

* * *

శ్రీపతి మళ్ళీ ఏదో సినిమాకు వెళ్లాడు. సినిమా పేరుగాని, హాలు పేరుగాని చూచే మనోస్థితి తాన్ని కోల్పాయాడు. యాంత్రికంగా టిక్కట్ తీసుకొని హాలులో పడ్డాడు. ఆట సగమైపోయింది. తీరా చూస్తే తాను చూచిందే ఆ సినిమా. గ్రహచార మనుకొని రూము చేరుకున్నాడు.

ఏదోలా నిద్రపోయిన శ్రీపతికి తెల తెలవారుతుండగానే ఎవరో ఓ కవరు యిచ్చివెళ్ళారు. విప్పి చూశాడు:

"సక్రమమైన పంథాలో పయనించడం ద్వారా మానవుడు ఉత్కృష్ణ తను సంతరించుకుంటాడు. లేకపోతే అతని జీవితం కంటకావృత మౌతుంది. ఈ వాక్యాలను సర్వదా గుర్తుంచుకొని, సక్రమంగా నడచుకుంటా వని ఆశిస్తూ–

నీ శుభాన్ని కాంక్షించి

ఇట్లు
పూర్ణానంద్."

రెండు, మూడు మారులు చదువుకొన్న శ్రీపతి ఆగ్రహానికి తునాతునక లైపోయిందా జాబు, కవరుతో సహా. చిరుగాలికి రెపరెప ఎగిరే కాగితం ముక్కలలో రెండు వందల రూపాయలు! ఎంత పొరపాటైంది!! కవరులో వున్నట్టు తను చూడనేలేదు.

"అయినా నీ వా నోట్ల విలువను కోల్పోయావు" తనలో ఎవరో నూతిలో నుండి పలికినట్టు పలికారు. ★